శివాలయాల్లో కార్తీక దీప శోభ


మృత్యుంజయకుంట శివాలయంలో దీపాలు వెలుగిస్తున్న భక్తులు


ఆలయానికి పోటెత్తిన భక్తులు


వెయ్యి ఒత్తుల అఖండ దీపం


మోచంపేట శ్రీ ప్రసన్న విశ్వేశ్వరుడు


కార్తీక పూజలు చేస్తున్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి దంపతులు


కార్తీక దీపాలు వెలగిస్తున్న మహిళలు


శివుడి దర్శనం కోసం ..


ఆకుల వీధిలోని శ్రీ కాశీవిశ్వేశ్వరుడు

కడప కల్చరల్ : కార్తీక దీపాలతో నగర శివాలయాలు మెరిసిపోయాయి. సోమవారం తెల్లవారు జామున 3 గంటల నుంచే ఆలయాల్లో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కొన్నిచోట్ల రుద్ర హోమాలు, మిగతా అన్ని ప్రాంతాల్లో బిళ్వపత్రార్చన తదితర పూజలు చేశారు. దేవాలయాలన్నీ ఉదయం నుంచి 11 గంటల వరకు లింగాష్టకంతో మార్మోగాయి. విశేష అలంకరణ అనంతరం భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రాంగణాలన్నీ కార్తీక దీపాలతో కళకళలాడాయి. దాదాపు అన్ని ఆలయాలలో ఓ దశలో దీపాలు పెట్టేందుకు చోటే లేకుండా పోయింది. ఏమాత్రం చిన్న స్థలం లభించినా అక్కడ దీపాలు పెట్టి శివయ్యను ఆరాధించి పూజలు నిర్వహించారు. పలువురు పురుషులు కూడా దీపాలు పెట్టడం విశేషం. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద తొలి దర్శనానికి బారులు తీరారు. కడప నగరంలోని మృత్యుంజయ కుంట శివాలయం, దేవుని కడప శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయం, గడ్డిబజారు శివాలయం, నబీకోట శివాలయంతోపాటు నగరంలోని దాదాపు అన్ని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక మాసం తొలి సోమవారం కావడంతో ఈ సందర్భంగా పూజలు చేయడం మంచిదని భావించి తెల్లవారుజాము నుంచి స్వామి దర్శనాల కోసం భక్తులు దేవాలయాల బాట పట్టారు.

ప్రముఖుల పూజలు

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, రామారావు దంపతులు కుటుంబ సమేతంగా దేవునికడప శ్రీ సోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆలయ ప్రాంగణంలో ధ్వజం వద్ద విశేష పూజలు నిర్వహించి ఆలయంలోని శివమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. ఈఓ శ్రీధర్ ఆధ్వర్యంలో అర్చకులు శశిధర్ బృందం వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి స్థానిక మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆమెకు స్వాగతం పలికి శివుడు, అమ్మవారిని దర్శింపజేసి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

క్లుప్తంగా

బద్వేలు ఇన్‌చార్జి డీఎంగా కన్యాకుమారి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ బద్వేలు ఇన్‌చార్జి డీఎంగా కన్యాకుమారిని నియమిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కడపలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న కన్యాకుమారిని బద్వేలు ఇన్‌చార్జి డీఎంగా నియమించారు. అక్కడ డీఎంగా పనిచేస్తున్న జీవీ నాగరాజును నందికొట్కూరుకు బదిలీ చేశారు.

యువతి అదృశ్యం

కడప అర్బన్: కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇక్బాల్ రైస్‌మిల్లు సమీపంలో తేజస్విని అనే యువతి అదృశ్యమైనట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలియజేశారు. తేజస్విని ఇంటర్ పూర్తి చేసి డాక్టర్ కోర్స్ కోసం ఇంటిలో వుండి చదువుకుంటుంది. ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో యువతి తండ్రి గురుమోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

డిసెంబర్ 1న వనభోజన మహోత్సవం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని చింతకొమ్మదిన్నె పోలీసుస్టేషన్ ఎదురుగా ఉన్న నందన గార్డెన్స్ వద్ద ఉన్న మామిడి వనంలో డిసెంబరు 1వ తేదీన బలిజ కుల బంధువుల కార్తీకమాస వన సమారాధన, వనభోజన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు సగినాల శ్రీనివాసులు, రెడ్డెయ్యలు తెలిపారు. సోమవారం అందుకు సంబంధించిన పోస్టర్లను వారు ఆవిష్కరించారు. వన భోజన కార్యక్రమంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, మూర్తి, ప్రసాద్, రామకృష్ణ, రవిశంకర్ పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిడితో టపాసుల స్టాల్ తొలగింపు

కడప సెవెన్‌రోడ్స్ : రాజకీయ ఒత్తిళ్లతో తమ టపాసుల దుకాణాన్ని తొలగించారంటూ టీడీపీ నాయకుడు బొమ్మిశెట్టి చంద్రశేఖర్ సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, టీపీఓలు తన ఒక్కడి స్టాల్‌నే కూల్చి వేయడానికి అత్యుత్సాహం ప్రదర్శించారని ఆరోపించారు. ఇందులో ఉన్న పాత్రధారులుబయటికి రావాల్సిందేనన్నారు. తనకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతానని, న్యాయస్థానాలనైనా ఆశ్రయిస్తానన్నారు. న్యాయం జరగకపోతే టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు సైతం వెనుకాడేదిలేదన్నారు.

సుధాకర్‌బాబుకు ఘన స్వాగతం


సుధాకర్ బాబు, రవీంద్రనాథరెడ్డిని సన్మానిస్తున్న దళిత నాయకులు

కడప కార్పొరేషన్: జిల్లా పర్యటనకు విచ్చేసిన వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్ బాబుకు ఘన స్వాగతం లభించింది. కడపలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, త్యాగరాజు, కంచుపాటి బాబు, సుబ్బరాయుడు, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ ట్రోఫీకి కడప క్రీడాకారులు ఎంపిక

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన వై. సునీల్‌కుమార్, పరమేశ్వర్‌రెడ్డిలు ఫుట్‌బాల్ క్రీడలో ప్రతిష్టాత్మకంగా భావించే సంతోష్ ట్రోఫీ సీనియర్ నేషనల్స్‌కు ఎంపికయ్యారు. ఇటీవల అనంతపురం ఆర్‌డీటీలో నిర్వహించిన ఎంపికల్లో వీరు చక్కటి ప్రతిభ కనబరచడంతో వీరిని సంతోష్‌ట్రోఫీలో పాల్గొనే ఏపీ జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 15 నుంచి అనంతపురం ఆర్‌డీటీలో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కడప క్రీడాకారులు ఈ టోర్నమెంట్‌కు ఎంపికవడం పట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డానియల్ ప్రదీప్, సుధీర్, ఉపాధ్యక్షుడు థామస్ జీవన్‌బాబు తదితరులు అభినందనలు తెలిపారు.

కార్తీక అభిషేకాలు

కడప కల్చరల్ : కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ ప్రాంగణంలోని శివునికి సోమవారం కార్తీక అభిషేకాలు నిర్వహించారు. కార్తీకమాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శివునికి పంచద్రవ్యాలతో పూజలు చేశారు. ఒక్కొ ద్రవ్యంతో అరగంటపాటు అభిషేకం చేయడంతో దాదాపు మూడున్నర గంటలపాటు భక్తుల శివనామస్మరణతో ఆలయం ప్రతిధ్వనించింది.

కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడు


కందుల శివానందరెడ్డి వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న కళాశాల సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: కందుల శివానందరెడ్డి చిరస్మరణీయుడని కేఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్‌ఎస్‌మూర్తి అన్నారు. కందుల శివానందరెడ్డి 4వ వర్ధంతిని సోమవారం కేఎస్‌ఆర్‌ఎంలో వారి కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాసులు, మిత్రులు, కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ కడప నగరానికి ఉచితనీటి సరఫరా, ఉచిత భోజనం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు వంటి సేవా కార్యక్రమాలను ఆయన నిర్వహించారన్నారు. కేఎస్‌ఆర్‌ఎం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ విజ్ఞత, విలువలు, ప్రజా సేవే ఆయన ఆస్తి అన్నారు. వైస్ చైర్మన్ కందుల మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ స్ఫూర్తి ప్రదాత, వ్యూహాత్మక దృష్టి కలిగిన నాయకులు కందుల శివానందరెడ్డి అన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 250 మంది రక్తదానం చేసి రిమ్స్ వారికి అందజేశారు. అనంతరం 38 మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందించారు. అలాగే కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం కందుల చారిటబుల్ ట్రస్టు ద్వారా రిమ్స్‌లో ఇకపై ప్రతి మంగళ, శుక్రవారాల్లో 350 మందికి తగ్గకుండా అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కందుల విద్యాసంస్థల ప్రతినిధులు కందుల రాజేశ్వరమ్మ, వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ కేఎల్‌ఎం ప్రిన్సిపాల్ రత్నమ్మ, కేఎస్‌ఆర్‌ఎం స్టడిస్ ప్రిన్సిపాల్ నాగమని వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి

– జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి శారదమ్మ


పశుగణన సిబ్బందికి సూచనలు ఇస్తున్న డాక్టర్ శారదమ్మ

కడప అగ్రికల్చర్: జిల్లావ్యాప్తంగా చేపట్టిన పశుగణనకు సంబంధించి రైతులు పశుగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి వివరాలను తెలియచేయాలని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ శారదమ్మ సూచించారు. పశుగణనలో భాగంగా సోమవారం కడప మండల పరిధిలోని ఆలంఖాన్‌పల్లి, వల్లూరు మండలం గంగాయపల్లెలతోపాలు పలు గ్రామాల్లో జరుగుతున్న పశుగణన నమోదును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా గెదెలు, ఎద్దులు, ఆవులు, కోళ్లు, మేకలు ఇలా 16 రకాల జంతువుల వివరాలను తమ సిబ్బంది నమోదు చేస్తున్నారన్నారు. ఈ పశుగణన 2025 ఫిబ్రవరి 28వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారులు మారుతిప్రసాద్, శ్రీహరి ఎన్యుమలేటర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలించాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బాలికలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : తల్లిదండ్రులు బాల్య వివాహాల జోలికి వెళ్లకుండా తమ బిడ్డలను చదివించి ప్రయోజకులను చేయాలని ఏసీడీపీఓ శోభారాణి, ప్రధానోపాధ్యాయురాలు షర్మిల పిలుపునిచ్చారు. సోమవారం కడప నగరంలోని బాలికల పాఠశాలలో బాల్య వివాహాలు, వాటివల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బిడ్డలకు నిర్దీత వయస్సు వచ్చిన తర్వాత వివాహాల గురించి ఆలోచించాలన్నారు. ముఖ్యంగా బాలికలు విషయంగా తల్లిదండ్రులు ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాజంలో ఆడపిల్లలను ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు తల్లిదండ్రులు చేయూతనివ్వాలని సూచించారు. చివరగా బాల్య వివాహాలను చైతన్యవంతులను చేస్తూ కరపత్రాలను విద్యార్థినిలచే ఆవిష్కరించారు. సూపర్‌వైజర్ దీప, డీసీపీయూ సిబ్బంది లక్ష్మిప్రసన్న, అంగన్వాడీ కార్యకర్త పద్మావతి, ఉపాధ్యాయురాలు గాయత్రి పాల్గొన్నారు.

అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ట ఏర్పాట్లు

నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి


ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలోని మున్సిపల్ మైదానంలో ఈనెల 8వ తేది నుంచి 16వ తేది వరకూ జరగనునన అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలని నగరపాలక కమిషనర్ మనోజ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని వీసీ హాలులో నిర్వహించిన «ప్రజా సమస్యల పరిష్కార వేదిక» కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అగ్నిపథ్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ సందర్భంగా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేసి, రన్నింగ్ ట్రాక్ పై ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీ ప్రాంతంలో ప్రాంతంలో మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంచేలా చూడాలని, తాగునీటి సరఫరా సవ్యంగా ఉండాలన్నారు. ఇండోర్ స్టేడియంలో సిబ్బందితో సహకరించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. డీ.టీ.సీ. ప్రాంతంలో నీటి సరఫరా, మరుగుదొడ్ల శుభ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ర్యాలీ సమయంలో స్టేడియంలో వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడాలని, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ర్యాలీ జరిగే ప్రాంతం మొత్తం శుభ్రంగా ఉండేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఇందులో మొత్తం 18 అర్జీలు రాగా, అందులో ఇంజనీరింగ్ విభాగం అర్జీలు– 7, రెవెన్యూ విభాగం –5, టౌన్‌ప్లానింగ్–4, హెల్త్ విభాగం–1, యూపీఏ విభాగం–1 అర్జీలు వచ్చాయి. సమస్యల పరిష్కారంలో శాఖాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో తిరిగి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర, డిప్యూటీ కమిషనర్ రాంబాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మునిరత్నం, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నారాయణస్వామి, ధనలక్ష్మి, ఆర్‌ఓలు విజయ్ భాస్కర్ గౌడ్, కన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేసిన సివిల్ జడ్జి



లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫ్రకృద్దీన్

కడప అగ్రికల్చర్: కడప నగరం రైతు బజార్‌లోని లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను సోమవారం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫ్రకృద్దీన్ విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన లీగల్ ఎయిడ్ క్లినిక్‌లో ఉన్న పారా లీగల్ వలంటరీతో మాట్లాడారు. ప్రజల సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. క్లినిక్ విధి విధానాలను, పారా లీగల్ వలంటర్ విధివిధానాలను తెలియజేశారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100 గురించి వివరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కడప కోటిరెడ్డిసర్కిల్ :
కడప నగర శివార్లలోని పాలెంపల్లె సమీపంలో ఓ ఆటోలో తీసుకు వెళుతున్న 17 బస్తాల రేషన్ బియ్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సౌజన్య తెలిపారు. ఈ మేరకు స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చెన్నూరు గోడౌన్‌కు తరలించామన్నారు. ఈ సంఘటనలో నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని ఆమె వివరించారు.

ఉర్దూ యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేయాలి

వీసీకి రూట నాయకుల వినతి


వీసీ పఠాన్ షేక్ షావల్లిఖాన్‌ను సన్మానిస్తున్న రూట నాయకులు

కడప ఎడ్యుకేషన్: కర్నూలులోని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వ విద్యాలయంలో అకడమిక్ కన్సెల్టెంట్‌లతో నెట్టుకొస్తున్నారని, వెంటనే ఖాళీగా ఉన్న ఆచార్యుల పోస్టులను భర్తీ చేసి అభివృద్ధికి కృషి చేయాలని రూట లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసీవుల్లా భక్తియారీసాహేబ్ కోరారు. కడపకు విచ్చేసిన ఉర్దూ యూనివర్సిటీ వీసీ పఠాన్ షేక్‌షావలి ఖాన్‌ను సోమవారం కలిసి రూట ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ వసీవుల్లా భక్తియారీసాహేబ్, ముహమ్మద్ ఆయూబ్‌లు కలిసి వీసీకి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు గత ఐదు సంవత్సరాలుగా యూనివర్సిటీ అభివృద్ధి లేక అలాగే ఉందన్నారు. కార్యక్రమంలో అంజుమన్ తరక్కీ ఉర్దూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్తార్‌ఫైజీ, సయ్యద్ హిదయతుల్లా, సభ్యులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని బుధవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యా దీవెన, వసతి దీవెన నిధులు రూ.3480 కోట్లను ఈ ప్రభుత్వం విడుదల చేయకుండా విద్యార్థులను విద్యకు దూరం చేస్తోందన్నారు. ఏ ప్రభుత్వమైన బకాయిలు ఉంచితే నూతన ప్రభుత్వం వాటిని విడుదల చేయాలన్నారు. అలాగే జీవో 77ను రద్దుచేసి ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్ కల్పించే విధంగా చూడాలన్నారు. అలాగే డిగ్రీ హానర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న 3220 పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్ఐ నాయకులు ఉదయ్ పాల్గొన్నారు.

గుంతలు పూడ్చరు..మురుగు కదలదు



కూటమి ప్రభుత్వం వచ్చాక మున్సిపాలిటీల్లో పాలన పడకేసింది. కడప నగరంలోని పలు వీధుల్లో మురుగు నీరు, వర్షం నీరు నలిచిపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రధాన రహదారులపై ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారుల నియంత్రణ లేకపోవడం, గుంతల్లో మురుగు నీరు చేరి నగరం మురికిమయంగా అవుతోంది. గత నాలుగు రోజులుగా గుంతలు పూడ్చివేసే కార్యక్రమం అంటూ చేపట్టిన ఆర్భాటం ఈ గుంతలను చూస్తే తెలుస్తోంది. ఇది గుంతల ప్రభుత్వమని ప్రజలు అనుకుంటున్నారు. ఈ దృశ్యాలు సాక్షి కెమెరా బంధించింది.

– సాక్షి సీనియర్ ఫొటోగ్రాఫర్, కడప


పాత రిమ్స్ వద్ద ఏర్పడిన గుంతల్లో నిలిచిన నీరు




ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని గుంతల్లో నిలిచిన మురుగునీరు

రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు
సొంత భవనాలు నిర్మించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప అర్బన్ ,కడప రూరల్, వేంపల్లి, ముద్దనూరు, మైదుకూరు, దువ్వూరు రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు స్థలాలు, నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గుంటి. వేణు గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని పాత రిమ్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా రిజిస్టర్ కార్యాలయం 1864లో నిర్మించటం జరిగిందని 2001 సంవత్సరంలో వచ్చిన వరదల కారణంగా కార్యాలయం దెబ్బతినిందన్నారు. దీంతో కార్యాలయాన్ని మరో చోటకు మార్చడం జరిగిందన్నారు. కడపలో అర్బన్, రూరల్ ఆఫీసులుగా 2007లో విభజించిన తరువాత ఇప్పటివరకు అర్బన్ ,రూరల్, డీఐజీ కార్యాలయాలు అన్నీ బాడుగ భవనాలలో కొనసాగుతున్నాయని, లక్షలాది రూపాయలు బాడుగలు చెల్లిస్తున్నారన్నారు. సంవత్సరానికి 500 కోట్ల రూపాయలు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ అందించే రిజిస్టర్ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని అనేకమార్లు జిల్లా అధికారులకు గత, ప్రస్తుత ప్రభుత్వాధి నేతలకు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జిల్లాలోని శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు ప్రభుత్వంతో చర్చించి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నిధులు కేటాయించి సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

నాగేశ్వరరావు మృతికి సంతాపం

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయంలోని మైక్రోబయాలజీ విభాగంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేసే టైమ్‌స్కేల్ ఉద్యోగి ఎస్. నాగేశ్వరరావు అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం ఉదయం వైవీయూ పరిపాలన భవనం ప్రాంగణంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు చిత్ర పటానికి వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పి. పద్మ, ప్రిన్సిపల్ ఎస్. రఘునాథ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.